
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక



ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 104 | శనివారం 25 జూలై 2026 | పేజీలు : 4 | వెల : 3/-


## ఆగస్టు నుంచి

# సంజీవని



- సద్వినియోగం చేసుకోండి
- ఆగస్టు నుంచి ఏపీలో సంజీవని ఆరోగ్య పథకం అమలు
- ప్రతి వ్యక్తికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్
- వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందిస్తామని హామీ
- గత ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని సీఎం విమర్శ
- పరదాలు కట్టకుండా ప్రజల మధ్యకు వస్తున్నానన్న చంద్రబాబు

అమరావతి

ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'సంజీవని' పథకాన్ని ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. "మీ ఆరోగ్యం.. మీ బాధ్యత" అని ప్రజలకు పిలుపునిచ్చిన ఆయన, ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరిలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమం బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఆధునిక సాంకేతికతను జోడించి రూపొందించిన ఈ ప్రాజెక్టు విశిష్టతలను ప్రజలకు వివరిం చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. విద్య, వైద్యంపైనే ప్రతి కుటుంబం అధికంగా ఖర్చు చేస్తున్న నేపథ్యంలో, ప్రజల ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించేలా 'సంజీవని'ని తీర్చిదిద్దామని తెలిపారు. ఈ పథకంలో భాగంగా ప్రతి పౌరునికి ఒక డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించి, కుటుంబ సభ్యులందరికీ హెల్త్ ఐడీలు జారీ చేస్తామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజల ఆరోగ్య సమాచారాన్ని ఒకే వేదికపై అనుసంధానం చేస్తామని వివరించారు. కేవలం వ్యాధి వచ్చాక చికిత్స అందించడమే కాకుండా, వ్యాధులు రాకముందే గుర్తించడం (ప్రెడిక్టివ్), నివారణ చర్యలు చేపట్టడం (ప్రివెంటివ్), అవసరమైనప్పుడు నాణ్యమైన వైద్యం అందించడం (క్యూరేటివ్) అనే త్రిముఖ వ్యూహంతో సంజీవని పనిచేస్తుందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 80 లక్షల మంది తీవ్ర వ్యాధులతో బాధపడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయని, ఈ పరిస్థితిని మార్చేందుకే ఈ ప్రాజెక్టును తీసుకొస్తున్నామని అన్నారు. నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు, మాతా-శిశు సంరక్షణ, 108, 104 సేవలు, ఈ-ఔషధి వంటి అన్ని వ్యవస్థలను ఒకే డిజిటల్ గొడుగు కిందికి తీసుకొస్తామని వెల్లడించారు.

## గోవా గవర్నర్‌ను కలిసిన పారిశ్రామికవేత్తల బృందం





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 25:**

అనపర్తి మండలం పొలమూరు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సత్తి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గోవా గవర్నర్ ఆంధ్ర రాష్ట్ర ముద్దుబిడ్డ అశోక గజపతిరాజు ను మర్యాదపూర్వకంగా కలిశారు, నిస్వార్ధ సేవల ద్వారా ఉత్తరాంధ్రతో పాటు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం గవర్నర్ అశోక్ గజపతిరాజు చేసిన కృషిని ప్రశంసించారు, గోవా మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ లోని పర్యటరంగం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.కేంద్రమంత్రి హయాంలో భోగాపురం ఎయిర్ పోర్ట్ కి మీరందించిన కృషి ఫలితంగా ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి మరింత దోహదపడుతుందని శ్రీనివాసరెడ్డి కొనియాడారు. ఈకార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు కర్రి అప్పారెడ్డి,రాజేష్, కోటేశ్వరరావు, కర్రిసుధాకర్ రెడ్డి తదితరులు గవర్నర్ ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం రాజ్ భవనంలో గవర్నర్ ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.



### రాహుల్ పోరాటం, విద్యార్థుల ఐక్యత వల్ల

## కేంద్రం దిగివచ్చింది

- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్
- అప్రజాస్వామిక విధానాలపై సాధించిన గొప్ప గెలుపన్న పొన్నం
- కేంద్రంపై ఉన్న వ్యతిరేకతకు ఇది నిదర్శనమని వ్యాఖ్య

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థులు, ఉద్యమకారుల విజయమని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇది అప్రజాస్వామిక విధానాలపై సాధించిన గొప్ప గెలుపని ఆయన అభివర్ణించారు. రాహుల్ గాంధీ పోరాటం, దేశవ్యాప్తంగా విద్యార్థులు చూపిన ఐక్యత వల్ల కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దనే బలమైన గుణపాఠం కేంద్రానికి దక్కిందని స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ పతనానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే మొదటి మెట్టు అని పొన్నం ప్రభాకర్ విమర్శించారు. విద్యార్థుల నిరసనలను అణచివేసేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేసి, మెట్రో సేవలు బంద్ చేసి, లాఠీ ఛార్జీలు జరిపినా వెరవకుండా వేలాది మంది విద్యార్థులు ధర్నాలో పాల్గొనడం కేంద్రంపై ఉన్న తీవ్ర వ్యతిరేకతకు నిదర్శనమని అన్నారు. ఉద్యమించి విజయం సాధించిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులోనూ ప్రజావ్యతిరేక విధానాలపై ఇదే రీతిలో ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

### హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ కుదేలైందనే

# ప్రచారంలో నిజం లేదు

- ఉద్దేశపూర్వకంగా కొందరు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారన్న పొంగులేటి
- కాంగ్రెస్ పాలనలో 20 శాతం వరకు రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందిందని వెల్లడి
- హైదరాబాద్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతున్నామన్న మంత్రి
- గత పదేళ్ల పాలనతో పోలిస్తే ఈ రెండున్నరేళ్లలోనే రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పుంజుకుంది



హైదరాబాద్

హైదరాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందంటూ కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, ఇందులో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉన్న స్పష్టమైన గణాంకాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. గత రెండున్నరేళ్ల ప్రజా ప్రభుత్వ పాలనలో 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని, ప్లాట్ల విక్రయాలు ఏకంగా 40 శాతం వరకు పెరిగాయని వెల్లడించారు. గత పదేళ్ల పాలనతో పోలిస్తే ఈ రెండున్నరేళ్లలోనే రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పుంజుకుందని తెలిపారు. 2004-2014 మధ్య నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ సెక్టార్ అభివృద్ధితో హైదరాబాద్ రోల్ మోడల్‌గా మారి ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని మంత్రి గుర్తుచేశారు. ఇటీవలి దావోస్ పర్యటనలో కూడా పలువురు అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు నగరంలో పెట్టుబడులకు ఆసక్తి చూపారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

# అర్ధం కానీ జగన్ వ్యూహం



**కడప :** దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వర్సెస్ ఇండియా కూటమి ప్రతిపక్షాల నడుమ తీవ్రమైన రాజకీయ పొలరైజేషన్ నడుస్తోంది. నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారం నుంచి పార్లమెంట్ నిరసనల వరకు ప్రతి అంశమూ కేంద్ర వర్సెస్ విపక్షాలుగా ప్రత్యక్ష రణరంగాన్ని తలపిస్తోంది. అయితే, దేశమంతటా ఈ స్థాయిలో రాజకీయ వేడి రగులుతుంటే.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం చిత్రమైన రాజకీయ నిశ్శబ్దం అలముకుంది. ఏపీలో కూడా ఎన్డీఏ శ్రేణుల పాలన నడుస్తుండటం, ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీ ఉండటంతో జాతీయ స్థాయి అంశాలపై ఇక్కడ కూడా రాజకీయ సెగ రావలసి ఉంది. కానీ, ఆ స్థాయి ప్రతిస్పందన ఏపీ రాజకీయాల్లో కనిపించకపోవడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది. రాష్ట్రంలో విపక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో నీట్ బాధితులు, విద్యార్థుల పక్షాన నిరసన ప్రదర్శనలు చేపట్టినప్పటికీ, ఏపీలో ఆ పార్టీకి ఉన్న పరిమిత బలమైన కేడర్, ఓటు బ్యాంక్ దృష్ట్యా ఆ ఆందోళనలు అధికార పక్షంపై పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. నిజానికి, వైయస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఇది ఓ అరుదైన రాజకీయ అవకాశం. రాష్ట్రంలో లక్షలాది మంది నీట్ అభ్యర్థులు, యువత ఆందోళనలో ఉన్న వేళ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను నిలదీస్తూ గళమెత్తి ఉంటే ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీకి మైలేజీ వచ్చి ఉండేది. కానీ, వైయస్సార్‌సీపీ ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా విద్యార్థి పోరాటంలోకి దూకలేకపోయింది. ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ నాయకత్వం వహిస్తున్న ప్రతిపక్షాల సమరానికి జగన్ మద్దతు ఇవ్వకపోవడం వెనుక ఆయన సొంత రాజకీయ సమీకరణలు ఉన్నప్పటికీ, కనీసం స్వతంత్రంగా విద్యార్థుల హక్కుల కోసమైనా గళం విప్పకపోవడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. కాంగ్రెస్‌తో జట్టుకట్టడం ఇష్టం లేకపోయినా, యువత బహుళ ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఈ అంశంపై క్షేత్రస్థాయిలో తిరుగుబాటు జెండా ఎగరేసి ఉంటే వైయస్సార్‌సీపీ మళ్లీ జనామోదాన్ని పొందేందుకు అది నైతిక బలాన్ని ఇచ్చేది. కానీ, జగన్ ధైర్యంగా ముందుకు రాకపోవడం వల్ల ఏపీలో అధికార కూటమికి ఎలాంటి విపక్ష నిరసనల సెగ తగలకుండా సురక్షితంగా బయటపడే అవకాశం లభించింది. జాతీయ స్థాయిలో నడుస్తున్న ప్రతిపక్షాల వేవ్‌ను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో వైయస్సార్‌సీపీ నాయకత్వం చూపుతున్న 'అతి జాగ్రత్త వైఖరి వెనుక బలమైన కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంతో నేరుగా విభేదించడం వల్ల రాబోయే రోజుల్లో చట్టపరమైన సమస్యలు ఎదురవుతాయనే భయాలు వైయస్సార్‌సీపీ వైఖరిని నియంత్రిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఢిల్లీ పర్యటనల ద్వారా కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించేందుకు జగన్ యత్నించిన తీరు చూస్తే, ఆయన కేంద్ర అధికార పీఠంతో నేరుగా ఢీ కొట్టేందుకు అస్సలు సిద్ధంగా లేరని స్పష్టమవుతోంది. ఈ రక్షణాత్మక రాజకీయ ధోరణి వల్ల ప్రధానంగా నష్టపోతోంది వైయస్సార్‌సీపీ మాత్రమేనని చెబుతున్నారు. ఒక ప్రతిపక్షంగా ప్రజలు, యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై వీధుల్లోకి వచ్చి పోరాడటంలో విఫలమైనప్పుడు, ఆ రాజకీయ ఖాళీని ఇతర శక్తులు పూరించే ప్రమాదం ఉంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం నుంచి పార్టీ కేడర్‌ను తిరిగి సమీకరించడానికి, కొత్త ఉత్సాహాన్ని నింపడానికి నీట్ వంటి జాతీయ అంశం ఒక అద్భుతమైన రాజకీయ అస్త్రంగా ఉపయోగపడి ఉండేది. కానీ, ఆ అవకాశాన్ని వైయస్సార్‌సీపీ చేజేతులా వదులుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతిపక్షం నుంచి గట్టి ప్రతిఘటన లేదా రాజకీయ నిరసనలు లేకపోవడంతో, కూటమి ప్రభుత్వం తమ పాలనాజెండాను చాలా సులువుగా అమలు చేయగలుగుతోంది. ఒకవైపు దేశమంతటా విపక్షాలు కేంద్రాన్ని కుదిపేస్తుంటే, ఏపీలో మాత్రం ఎన్డీఏ ప్రభుత్వం ఎటువంటి రాజకీయ ఇబ్బందులు లేకుండా అత్యంత కంఫర్టబుల్ జోన్‌లో కొనసాగుతోంది. జాతీయ స్థాయిలో వస్తున్న అవకాశాలను అందుకోవడంలో, ప్రజా సమస్యలపై అగ్రెసివ్ మైలేజీ సాధించడంలో వైఎస్ జగన్ అనుసరిస్తున్న ఈ వెనకడుగు వైఖరి వైయస్సార్‌సీపీ భవిష్యత్ రాజకీయాలకు ప్రతిబంధకంగా మారే అవకాశం ఉంది. ప్రతిపక్ష హోదాలో ఉంటూ కూడా కేంద్రంతో లేదా అధికార కూటమితో తలపడటానికి వెనుకాడటం వల్ల పార్టీ మద్దతుదారుల్లో తీవ్ర నిరాశ నెలకొంటోంది. రాబోయే రోజుల్లోనైనా జగన్ తన రాజకీయ శైలిని మార్చుకుని, ప్రజల్లో ఉండే సమస్యలపై పోరాట బాట పడతారా లేక ఇదే సైలెంట్ స్ట్రాటజీని కొనసాగిస్తారా అనేది చూడాల్సి ఉంది.

# లింక్డిన్‌లో వైజాగ్ టాప్



**విశాఖపట్టణం :** ఆంధ్రప్రదేశ్‌లో లెక్కలు మారుతున్నాయి.. రాష్ట్రానికి కంపెనీల రాకతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా విశాఖపట్నానికి ఐటీ కంపెనీలతో పాటుగా డేటా సెంటర్లు, పరిశ్రమలు రావడంతో అక్కడ ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల్లో విశాఖపట్నం టాప్‌లో నిలిచింది. మొన్నటి వరకు 3వ స్థానంలో ఉన్న విజయవాడ 10వ స్థానానికి పడిపోయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ఫోకస్ పెట్టింది. జిల్లాల వారీగా పరిశ్రమలు, ఐటీ కంపెనీలను తీసుకొస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల జాబితాలో ఏపీకి స్థానం దక్కింది. ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ సర్వీస్ లింక్డిన్ సిటీస్ ఆన్ ది రైజ్ పేరుతో విడుదల చేసిన సెకండ్ ఎడిషన్ జాబితాలో విశాఖపట్నం మొదటి స్థానంలో నిలిచింది. లుధియానా రెండో స్థానం, సూరత్ మూడో స్థానం, వడోదర నాలుగో స్థానం, ప్రయాగ్‌రాజ్ ఐదో స్థానం, రాజ్‌కోట్ ఆరో స్థానం, జబల్‌పూర్ ఏడో స్థానం, రాంచీ ఎనిమిదో స్థానం, రాయ్‌పూర్ తొమ్మిదో స్థానం, విజయవాడ పదో స్థానంలో నిలిచాయి. అయితే గతంలో మూడో స్థానంలో నిలిచిన విజయవాడ ఈసారి పదో స్థానానికి పడిపోయింది. లింక్డిన్ న్యూస్, డేటా సైంటిస్టులు రూపొందించిన ఈ ర్యాంకింగ్‌లకు సంబంధించి.. ఉద్యోగ అవకాశాలు, నియామకాలు, టాలెంట్ మైగ్రేషన్ పెరుగుతున్న అభివృద్ధి చెందుతున్న నగరాలను గుర్తిస్తున్నారు. మార్చి 2024 నుంచి ఫిబ్రవరి 2026 మధ్య కాలంలో లక్షలాది లింక్డిన్ సభ్యుల ప్రొఫైల్‌లు, ఉద్యోగ ప్రకటనల నుంచి సేకరించిన డేటా ఆధారంగా ఈ ర్యాంకింగ్స్ రూపొందించారు. గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ డేటా సెంటర్ ప్రాజెక్ట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ విస్తరణలతో సహా భారీ స్థాయి పెట్టుబడుల కారణంగా విశాఖపట్నానికి టాప్ ప్లేస్ దక్కింది. అంతేకాదు విశాఖపట్నంలో ఐటీ సేవలు, ఫార్మా, టెక్నాలజీ రంగాలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. వీటిలో డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, లారస్ ల్యాబ్స్, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ వంటి ప్రధాన సంస్థలు ఉన్నాయి. నగరంలోని ఉద్యోగాలలో 17.1 శాతం రిమోట్ పద్ధతిలో, 5.2 శాతం హైబ్రిడ్ పద్ధతిలో ఉన్నాయి. బలమైన జాబ్ మార్కెట్, ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్న నగరాలను లింక్డిన్ గుర్తించింది. 10 నాన్ మెట్రో నగరాలకు ర్యాంకులు కేటాయించగా.. ఇక్కడ ప్రతి పోస్టుకు దరఖాస్తుదారుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా ఉందని తేలింది. దేశంలో అభివృద్ధి చెందుతున్న నగరాలు ప్రత్యేకంగా, ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాలు సృష్టించుకుంటున్నట్లుగా తేలింది. విశాఖలో ఐటీతో పాటుగా ఫార్మా, తయారీ రంగం, డేటా సెంటర్లు, పోర్టు వంటివి కీలకంగా మారాయి. ఇక రెండో స్థానంలో నిలిచిన లుధియానాలో ఉక్కు, విమానయానం, ఆతిథ్య రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా దక్కుతున్నాయి. సూరత్ టెక్స్‌టైల్, వజ్రాలు, స్టార్టప్‌లు, రియల్ ఎస్టేట్ ద్వారా విస్తరిస్తోంది. వడోదరలో కెమికల్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఎంటర్‌ప్రైజ్ పెట్టుబడులు వస్తున్నాయి. విజయవాడలో కూడా ఐటీ, ఈ-గవర్నెన్స్ కంపెనీల నుంచి ఆసక్తి పెరుగుతోంది. ఈ 10 నగరాల్లోనూ తొలి మూడు నియామకాల్లో ఐటీ సేవలు, టెక్నాలజీ, కన్సల్టింగ్ సర్వీసులు ఉన్నాయి. మిగతా నగరాల్లో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు ఉన్నాయని లింక్డిన్ చెబుతోంది.

# గ్రేటర్ ఎన్నికలకు కోర్టు మోకాలడ్డు




**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సన్నాహాల్లో మునిగి తేలుతున్న అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఊహించని షాక్ ఇచ్చింది. జీహెచ్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై హైకోర్టు తాత్కాలిక స్టే విధించడంతో అధికార వర్గాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. వార్డుల పునర్విభజన ప్రక్రియను చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం పూర్తి చేసి, సరిహద్దులను శాస్త్రీయ పద్ధతిలో పునర్నిర్ణయించేంత వరకు ఎలాంటి ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లవద్దని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం కఠినంగా ఆదేశించింది. రాజధాని నగరంపై పట్టు సాధిం చాలని భావిస్తున్న హస్తం పార్టీకి ఈ న్యాయపరమైన చిక్కు అతిపెద్ద రాజకీయ ఎదురుదెబ్బగా మారింది. ఈ వివాదానికి ప్రధాన మూలం ఇటీవల జీహెచ్‌ఎంసీ ఆదరాబాదరాగా చేపట్టిన వార్డుల విభజన ప్రక్రియలోని అవకతవకలే. మున్సిపల్ చట్టాల ప్రకారం ప్రతి వార్డు సరిహద్దు నిర్ణయం అనేది కేవలం ఆయా ప్రాంతాల జనాభా ప్రాతిపదికన, సమతుల్యత దెబ్బతినకుండా జరగాలి. కానీ, ప్రస్తుతం చేపట్టిన పునర్విభజన తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 లోని సెక్షన్ 6 స్ఫూర్తికి సంపూర్ణంగా విరుద్ధంగా ఉందంటూ పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లిన ఆధారాలు న్యాయస్థానాన్ని సంతృప్తిపరిచాయి. శాస్త్రీయ ప్రాతిపదికను పక్కనబెట్టి, కొన్ని ప్రాంతాలలో జనాభాను విపరీతంగా పెంచేసి, మరికొన్ని చోట్ల కుదించి వేయడం తీవ్రమైన అభ్యంతరాలకు దారితీసింది. ఈ పరిణామం వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనం వెతుక్కునే ప్రయత్నం చేసిందనే ఆరోపణలు ఇప్పుడు గట్టిగా బలపడుతున్నాయి. హైదరాబాద్ పరిధిలో సాంప్రదాయకంగా ప్రతిపక్షాలైన బిఆర్ ఎస్ , బీజేపీ , ఎంఐఎం బలంగా ఉన్న ఓటు బ్యాంకులను చెదరగొట్టేందుకే వార్డుల సరిహద్దులను తమకు అనుకూలంగా మార్చుకున్నారనే విమర్శలు క్షేత్రస్థాయి నుంచి వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్‌కు ప్రయోజనం చేకూర్చేలా ఓటర్లను, ప్రాంతాలను రాత్రికి రాత్రే అటు ఇటూ మార్చడం ద్వారా ఎన్నికల మేజిక్ చేయాలని చూశారన్న వాదనలకు కోర్టు బ్రేక్ ఇవ్వడంతో ప్రతిపక్షాలకు పెద్ద రాజకీయ ఆయుధం దొరికినట్లయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారాన్ని ఉపయోగించి వార్డుల సరిహద్దులను మార్చడం కొత్తేమీ కాకపోయినా, చట్టపరమైన నిబంధనలను, నిబంధన పత్రాలను పూర్తిగా తొక్కిపట్టడం కాంగ్రెస్‌కు రివర్స్ కొట్టింది. ప్రజాభిప్రాయ సేకరణను మమ అనిపించి, శాస్త్రీయ సర్వేలు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని చూడటమే హైకోర్టులో ప్రభుత్వం ఇరుకున పడటానికి కారణమైంది. ఈ స్టే ఆర్డర్ పరిణామం ప్రతిపక్షాలైన బిఆర్‌ఎస్, బీజేపీలకు రాజకీయంగా పెద్ద ఊరటనిచ్చింది. కాంగ్రెస్ పార్టీ తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని, గెలిచే అవకాశం లేకే అక్రమ మార్గాల్లో వార్డుల విభజన చేసింది అని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు వారికి చక్కటి అవకాశం లభించింది. హైకోర్టు తీర్పును అడ్డం పెట్టుకుని, గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ వైఫల్యాలను, అక్రమ రాజకీయ వ్యూహాలను ఎండగట్టడానికి ప్రతిపక్షాలు సన్నాహాలు చేస్తున్నాయి. ఇది నగర పరిధిలో కాంగ్రెస్ గ్రాఫ్‌ను మరింత దెబ్బతీసే ప్రమాదం లేకపోలేదు. హైదరాబాద్‌ను రాజకీయంగా తమ గుప్పిట్లోకి తీసుకోవాలని వేసిన డెలిమిటేషన్ ఎత్తుగడ కాంగ్రెస్ మెడకే చుట్టుకుంది. ఇప్పుడు కోర్టు ఆదేశాల ప్రకారం మళ్లీ మొదటి నుంచి శాస్త్రీయంగా, పారదర్శకంగా సరిహద్దుల నిర్ణయం చేపట్టాలంటే నెలల సమయం పడుతుంది. ఆలోగా ప్రతిపక్షాల విమర్శల దాడిని తట్టుకోవడం, ప్రజా క్షేత్రంలో ఎదురయ్యే వ్యతిరేకతను అధిగమించడం కాంగ్రెస్ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారనుంది.

## అనపర్తి లో రౌడీయిజంతో కూడిన అరాచక పాలన నడుస్తోందన్న మాజీ ఎమ్మెల్యే సత్తి

**దాడి ఘటనలు మీడియాకు విడుదల చేసిన మాజీఎమ్మెల్యే**

**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 25:** అనపర్తి నియోజకవర్గం లో వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నేత, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, మరికొందరి ఇళ్ళ పై జరిగిన దాడి ఘటన అనంతరం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. అనపర్తి వైఎస్ఆర్సిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి మీడియాసమావేశంలో మాట్లాడుతూ.. దాడి ఘటనకు సంబంధించి పోలీసులు ఇస్మాయిల్ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కి పంపామని చెప్పారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ ఎమ్మెల్యే కుమారుడితో ఉన్న ఫోటోలు, దాడికి ముందు సీసీ కెమెరాలను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించిన ఆధారాలు, దాడులకు పాల్పడిన వ్యక్తులు గ్రామంలో పలు వీధుల్లో అర్ధరాత్రి తిరిగిన ఫుటేజ్ లు మాజీ ఎమ్మెల్యే మీడియాకు విడుదల చేశారు. ఈ ఘటనలో 17 మంది వ్యక్తులు ఉన్నప్పటికీ ఒక్కరినే అరెస్టు చేసి చేతులు దులుపుకున్నారని ఆయన ఆరోపించారు. అనపర్తి నియోజకవర్గంలో రౌడీయిజం, అరాచక పాలన సాగుతుందని విమర్శించారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో తాలిబన్ల తరహాలో దాడులు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సత్తి విమర్శించారు. దాడుల్లో పాల్గొన్న వ్యక్తులు ఎమ్మెల్యే కుమారుడు మనోజ్ రెడ్డి అనుచరులు అని స్పష్టం అవుతుందని ఫుటేజ్ లు పోలీసులకు అందజేస్తున్నామని సీసీ ఫుటేజ్ ద్వారా పోలీసులు నిష్పక్షపాత విచారణ జరపాలని మిగిలిన ముద్దాయిలను అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి(రాంబాబు), వల్లభశెట్టి రామ సతీష్, ఏడుకొండలు, సత్తి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు తలుచుకుంటే ఏది అసాధ్యం..

**విద్యార్థి ఉద్యమం ముందు ప్రభుత్వాలు తలవంచక తప్పదు**

**ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఎం. హరూన్ రషీద్**

అంకుశం న్యూస్ ఉరవకొండ జూలై 25 : విద్యార్థులు తలుచుకుంటే దేనినైనా సాధిస్తారని, విద్యార్థుల ఉద్యమం ముందు ప్రభుత్వాలు తలవంచక తప్పదని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హరుణ్ రషీద్ అన్నార. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గత కొద్ది నెలల నుండి దేశవ్యాప్తంగా విద్యార్థులు విద్యార్థి సంఘాలు యువజన సంఘాలు పోరాటాల దాటికి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి రావడం విద్యార్థి ఉద్యమానికి నిదర్శనం అధికార అహంకారంతో మేము ఏం చేసినా చెల్లుతుందనే భావనతో ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర అమాయక విద్యార్థుల పట్ల అక్కడి పోలీసులు లాఠీ ఛార్జ్ చేసి,విద్యార్థులపై టియర్ గ్యాస్ ను ఉపయోగించడం సిగ్గుచేటని వారు మండిపడ్డారు. విద్యార్థి ఉద్యమాల ముందు తలవంచక తప్పదు,విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ప్రభుత్వాలకు ఇదే గతి పడుతుందని వారు హెచ్చరించారు. నీట్ పేపర్ లీకేజీ వంటి ఘటనలు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని మండిపడ్డారు, ప్రభుత్వాలు విద్యను కార్పొరేట్ లాభాలకు తాకట్టు పెట్టే విధానాలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరికేవరకు విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ ఉండి నిరంతరం విద్యార్థి సమస్యలపై అలుపెరగని పోరాటానికైనా సిద్ధమని ఈ సందర్భంగా ప్రభుత్వాలకు హెచ్చరించారు.

## కల్పవృక్ష వాహనంపై భక్తులను కటాక్షించిన శ్రీ సౌమ్యనాథస్వామివారు

**అంకుశం న్యూస్ తిరుపతి జూలై 25** నందలూరులోని శ్రీ సౌమ్యనాథస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో నాలుగో రోజైన శనివారం ఉదయం శ్రీ సౌమ్యనాథస్వామివారు దివ్యమైన కల్పవృక్ష వాహనంపై విహరిస్తూ భక్తులకు అనుగ్రహం ప్రసాదించారు.ల గోవింద నామస్మరణ, చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ సాగిన వాహనసేవ భక్తి పారవశ్యాన్ని నింపింది. అడుగడుగునా భక్తులు కర్పూరహారతులు సమర్పించి స్వామివారి దివ్య మంగళదర్శనం పొందారు. పురాణాల ప్రకారం కల్పవృక్షం కోరుకున్న కోర్కెలన్నింటినీ నెరవేర్చే దివ్య వృక్షంగా ప్రసిద్ధి చెందింది. ఆ కల్పవృక్ష వాహనంపై విహరించిన శ్రీ సౌమ్యనాథస్వామివారు భక్తులందరికీ సకల ఐశ్వర్యాలు, శుభఫలితాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆశీర్వదిస్తున్నారనే భావనతో భక్తులు విశేష భక్తిశ్రద్ధలతో వాహనసేవలో పాల్గొన్నారు. జూలై 26న ఉదయం శేష వాహనంపై, రాత్రి బ్రహ్మోత్సవాల్లో అత్యంత వైభవంగా నిర్వహించే గరుడ వాహనంపై శ్రీ సౌమ్యనాథస్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ వాహనసేవలో ఆలయ ఏఈవో రవి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ దిలీప్, ఆలయ అర్చకులు, అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన సామూహిక ఏడు శనివారాల వ్రతం.

**అంకుశం న్యూస్ ధర్మవరం జూలై 25** పట్టణంలోని శ్రీనివాస నగర్లో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి గుడిలో ఏడు శనివారాల వ్రతాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జింక రాజేంద్రప్రసాద్, సభ్యులు చెన్నం శెట్టి శ్రీనివాసులు, చెన్నం శెట్టి రమేష్, భక్తాదుల నడుమ ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయ అర్చకులు రాజేష్ స్వామి సామూహిక పూజలను సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలతో తులసి ఆకులతో అలంకరించిన వైనం భక్తాదాలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో దాదాపు 50 మంది ధర్మవరం మహిళలు సామూహిక పూజలో పాల్గొన్నారు.

## ఎర్రగుంట వైద్య నారాయణ ధన్వంతరి దేవాలయమును సందర్శించిన ఆలయ ట్రస్ట్ డైరెక్టర్ రామాంజనేయులు

**అంకుశం న్యూస్ ధర్మవరం జూలై 25** మడకశిర నుంచి నాయిబ్రాహ్మణ సోదరులు అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయం ట్రస్ట్ డైరెక్టర్ రామాంజినేయులు,మడకశిర కౌన్సిలర్ ఉమా శంకర్ , మడకశిర క్లస్టర్ టౌన్ ఇంచార్జ్ రవి కుమార్ స్థానిక ధర్మవరం పట్టణం లక్ష్మీ చెన్నకేశవపురం (యర్రగుంట) నందు శ్రీ వైద్య నారాయణ ధన్వంతరి దేవాలయం సందర్శించారు. ఇందుకుగాను కమిటీ సభ్యులు శాలువతో సన్మానించి మర్యాద పూర్వకంగా కలసి వారి ద్వారా మడకశిర పట్టణం నాయిబ్రాహ్మణ సోదరులకు అందరికి సమాచారం అందించగలరని కోరుతూ... స్వామి వారి ప్రతిష్ట కార్యక్రమానికి ఆహ్వానించడం జరిగింది. ఇందుకుగాను వారు హర్షం తెలియజెస్తూ....దేవాలయం అభివృద్ధి పనులకు మా వంతు సహకారం అందిస్తామని, తదుపరి టీటీడీ ద్వారా దేవాలయంనకు నిధులు వచ్చే సూచనలు తెలియజేస్తామని స్పందించారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర లింగమయ్య, ఆంజనేయులు, రామకృష్ణ,దామోదర్, ఆనంద్,ముత్యాలు, శేఖర్, నాగరాజు జనార్దన్,మారుతి,శ్రీనివాసులు,రత్నమ్మ, చంద్రకళ కోనాపురం సాయిప్రసాద్ పాల్గొన్నారు.

## పుష్ప బ్రిడ్జిగా స్పెషల్ ఎట్రాక్షన్

**విశాఖపట్టణం :** సోషల్ మీడియా.. అదో నిరంతర ప్రవాహం. వింతల నుంచి విశేషాల వరకూ.. యుద్ధాల నుంచి సినిమాల వరకూ.. నిత్యం ఎన్నో పోస్టులు, వేలకొద్దీ వీడియోలు.. ఇక ఇందులో ప్రకృతి గురించి, ప్రకృతి అందాల గురించి ఎన్నో విశేషాలను షేర్ చేస్తుంటారు. అలా షేర్ చేసిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. చూడగానే వావ్ ఎక్కడిదీ స్పాట్ అని అనకుండా ఉండలేం.. దాని గురించి ఆరా తీసిన తర్వాత ఓసారైనా వెళ్లొద్దామని మనసు లాగడం ఖాయం. అలాంటిదే ఇప్పుడు చెప్పుకోబోయే బ్రిడ్జ్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని మోతుగూడెంలో ఉంది ఈ వంతెన. మోతుగూడె ఫోర్‌బే డ్యామ్ బ్రిడ్జ్ అని పిలుస్తారు. లోయర్ సీలేరు హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టులో భాగంగా మోతుగూడెం ఫోర్‌బే డ్యామ్ నిర్మించారు. చుట్టూ దట్టమైన అడవులు, కొండలు.. పచ్చదనం పరుచుకున్న వాతావరణం మధ్య ఉన్న ఈ డ్యామ్.. ప్రకృతి ప్రియులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ ప్రకృతి అందాలను చూసి సినిమా డైరెక్టర్లు కూడా ఇక్కడ షూటింగ్‌లు జరుపుతుంటారు. ఇక పుష్ప సినిమా షూటింగ్ తర్వాత.. మోతుగూడెం ఫోర్ బే డ్యామ్

## ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులకు యూనిఫామ్ పంపిణీ



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 25:** బిక్కవోలు మండలం పందలపాక పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మెగా ్రావీ-4.0 ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, చీణూ నాయకులు, పాఠశాల అభివృద్ధి కమిటీ, పాఠశాల యాజమాన్య కమిటీ, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యార్థినులకు 60 జతల యూనిఫామ్ ను పందలపాక మాజీ ఉపసర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి అందజేయగా వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిర్ల శ్రీనివాసరెడ్డి ,అభివృద్ధి కమిటీ చైర్మన్ కోణాల సత్తిరాజు, ్రావీజ చైర్మన్ పంపన వీర సత్యనారాయణ అభినందనలు తెలియజేశారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్




**అంకుశం ప్రతినిధిహిందూపురం,జూలై,25:** పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నివారణే ధ్యేయంగా శ్రీ సత్యసాయి జిల్లా యంత్రాంగం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా – వీజ్ఞూహీూ) మరియు హిందూపురం పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "హంస ఇకో షాప్"ను జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. హిందూపురంలోని డి.బి కాలనీ, మినీ మార్కెట్ ఆవరణలో ఆర్. సుజాత నిర్వహణలో 100% ప్లాస్టిక్ రహిత ఉత్పత్తులతో ఈ ప్రత్యేక మల్టీ-ప్రొడక్ట్ స్టోర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ... ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు మానవ ఆరోగ్యానికి తీవ్ర విఘాతం కలుగుతోందని ,"ప్లాస్టిక్ నిషేధిద్దాం – పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోని ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.మహిళా సంఘాల సభ్యులు, స్వయం ఉపాధి ద్వారా పర్యావరణ అనుకూల వ్యాపార రంగానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఇలాంటి ఇకో షాపుల ద్వారా ప్లాస్టిక్‌కు అనుకూలమైన ప్రత్యామ్నాయ ఉత్పత్తులను ప్రజలకు తక్కువ ధరలోనే అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.ప్రతి ఒక్కరూ మార్కెట్లకు వెళ్లేటప్పుడు ప్లాస్టిక్ బ్యాగుల స్థానంలో గుడ్డ సంచులు, కాగితపు లేదా పర్యావరణ రహిత బయో-డీగ్రేడబుల్ సంచులను మాత్రమే ఉపయోగించాలని ప్రజలకు, వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు.ఈ షాప్‌లో పూర్తిగా 100% ప్లాస్టిక్ రహితంగా తయారైన ఉత్పత్తులు లభిస్తాయి.కిరాణా బ్యాగులు,క్యారీ బ్యాగులు,చెత్త సేకరించే గార్బేజ్ బ్యాగులు,డి-కట్ బ్యాగులు,పౌచెస్ నాణ్యమైన గుడ్డ సంచులు.కాగితపు ప్లేట్లు,మట్టి కప్పులు. ఈ కార్యక్రమంలో హిందూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మెప్మా పిడి నాగరాజు,హిందూపురం తహశీల్దార్ వెంకటేశు,పురపాలక సంఘం అధికారులు, మెప్మా సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

## పి.జి.ఆర్.ఎస్ పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి



**అంకుశం న్యూస్అనంతపురము జూలై 25 :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)పై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మరింత పారదర్శకత, జవాబుదారీతనం దిశగాను, నిరంతర అభిప్రాయ సేకరణ చేసి పౌరుల సంతృప్తిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ.ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందని చెప్పారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ.ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పి.జి.ఆర్.ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని సమర్పించవచ్చని చెప్పారు. ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని సూచించారు. క్యూ.ఆర్ కోడ్ వలన ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ https://pgrs.ap.gov.in/Home/QRGrievance Feedback కు చేరుతుందని అన్నారు. అర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కోరారు.

## నేటి యువత ఏకలవ్యన్ని స్ఫూర్తితో అన్ని రంగాలలో రాణించాలి

**ఆల్ ఇండియా ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే పురుషోత్తం**



**అంకుశం న్యూస్ ఉరవకొండ జూలై 25 :** నేటి యువత ముఖ్యంగా ఎరుకల జాతి విముక్తి కోసం విద్యను అభ్యసించి అన్ని రంగాలలో రాణించాలని ఆల్ ఇండియా ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.శనివారం ఉరవకొండలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఏకలవ్య జయంతిని పురస్కరించుకొని ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎరుకల జాతి భవిష్యత్తు విద్య మీదనే ఆధారపడి ఉందని స్పష్టం చేశారు.ఏకలవ్యుడు గిరిజన జాతి ఆత్మగౌరవానికి ప్రతీక,గురువుపై అచంచల భక్తి,క్రమశిక్షణ,స్వయంకృషి ఉంటే ఎలాంటి అసాధ్యాన్నైనా సుసాధ్యం చేయవచ్చని నిరూపించిన మహా యోధుడని కొనియాడారు.నేడు ప్రతి ఎరుకల బిడ్డలో ఆ ఏకలవ్య స్ఫూర్తి రగలాలని,విద్యతోనే మన జాతికి విముక్తి లభిస్తుందని,ఉన్నత చదువులే మనల్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తాయి" అని పిలుపునిచ్చారు.ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు,గురుకుల సౌకర్యాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత పదవుల్లో స్థిరపడి తల్లిదండ్రులకు,సమాజానికి,తమ సామాజిక వర్గానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు.ఎరుకల జాతి అభ్యున్నతికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ అరుణ,ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, ఎరుకల సంఘ నాయకులు ఎరుకల రూపు,ఎరుకల బొజ్జప్ప,ఆర్ఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి,వినయ్,ఫ్రెండ్స్ నందు,రాము తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ గ్యారంటీ పథకంలో భాగంగా పండ్ల మొక్కలు నాటిన ఎమ్మెల్యే




**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 25:** రంగంపేట మండలశీ ముకుందవరంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గర్ అండ్ ఆజీవీక మిషన్ (గ్రామీణ్) పథకం ద్వారా పండ్ల మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా పండ్ల మొక్కలను నాటిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో అధికారులు,రంగంపేట మండలం కూటమి నాయకులు,ముకుందవరం గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తల్లికి వందనం పథకం అందరికీ అందడంతో.. ప్రతి విద్యార్థి ఇంటా ఆనందం

**రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు.**





**అంకుశం న్యూస్, రామగిరి, జూలై : 25** రామగిరి మండలం కే.జీ.కుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఆమె ప్రారంభించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. గ్రామ సమీపంలోని కే.జీ.కుంట రోడ్డు నుంచి అక్కమ్మ అమ్మవార్ల దేవస్థానం వరకు 20 లక్షల ఉపాధిహామీ నిధులతో నిర్మించిన సి.సి రోడ్డును అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం వెంకటాపురం గ్రామంలో తల్లికి వందనం లబ్ధిదారులతో ఆత్మీయ భేటి నిర్వహించారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు బడికి వెళ్తున్నారు.. వారికి తల్లికి వందనం పథకం అందిందా అని ఆరా తీశారు. వెంకటాపురం గ్రామానికి చెంది లక్ష్మి, సాలక్క అనే మహిళలు తమకు నలుగురు పిల్లలు చొప్పున ఉన్నారని.. వారికి ఒక్కొక్కరికి 13వేల చొప్పున 52వేల రూపాయలు అందిందన్నారు. అలాగే ముగ్గురు, ఇద్దరు పిల్లలు ఉన్న వారు సైతం తమకు 26వేలు, 39వేలు అందిందని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఓ వైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం రెండూ కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికే రాప్తాడు నియోజకవర్గంలో ఈ రెండేళ్లలో రికార్డు స్థాయిలో రోడ్ల నిర్మాణాలు జరిగాయన్నారు. ఇక సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా అందిస్తున్నామన్నారు. తల్లికి వందనం ఈ రోజు ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా.. అందరికీ అందిందని విద్యార్థుల తల్లిదండ్రులు దీనిపై ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ మంచిని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్న ప్రభుత్వం ఇది అని ఎమ్మెల్యే సునీత అన్నారు...

## నీట్ ఆందోళనలపై స్పందించిన డిప్యూటీ సీఎం. పవన్ కల్యాణ్



**అంకుశం న్యూస్, అనంతపురం, జూలై : 25** విద్యార్థుల ఆందోళనను దారి మళ్లించారు, విద్యార్థుల ఆందోళనను విభజన శక్తులు హైజాక్ చేశాయి, ప్రజాస్వామ్య నిరసనను హింసాత్మకంగా మార్చాలని చూశారు, దేశ వ్యతిరేక నినాదాలకు చోటు లేదు ప్రజాస్వామ్య నిరసనకు నా మద్దతు ఉంటుంది దేశ వ్యతిరేక కార్యకలాపాలకు నేను వ్యతిరేకం, డిప్యూటీ సీఎం. పవన్ కళ్యాణ్.

## గుర్తుంపు లేని ఎస్సార్ గర్ల్స్ కాలేజీని సీజ్ చేయాలి అధిక ఫీజులు వసూళ్లు ....




**అంకుశం న్యూస్, అనంతపురం, జులై : 25** ప్రభుత్వ గుర్తింపు లేకుండా నిబంధనకు వ్యతిరేకంగా విద్యాసంస్థలు నడుపుతున్న టీవీ టవర్ వద్ద ఉన్న ఎస్సార్ (గర్ల్స్) జూనియర్ కళాశాల వద్ద ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ జేఏసీ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా ఉద్దేశించి విద్యార్థి జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా మరోపక్క బిల్డింగ్ కడుతూ, అదే భవనంలోనే తరగతులు, హాస్టల్ ను ఎలా నడుపుతారని ప్రశ్నించారు. ఇది అంశం పైన ఆర్ ఐ ఓ వెంకటరమణ కి ఫోన్లో ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ఒకపక్క లక్షలో ఫీజులు వసూలు చేస్తూ, మరోపక్క పుస్తకాలకు 9000, యూనిఫామ్ కి 6800, వేడినీళ్ళకు 3000, క్యాంటీన్ ఫీజ్ 4000, డ్యామేజ్ ఫీజు 3,000 రూపాయలు ఇలా అనేక రకాల పేర్లతో ఫీజు కాకుండా, సపరేటు 30 వేల రూపాయలు అధికంగా విద్యార్థి తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారు ఒకపక్క వర్షాలు లేక పంటలు పండక రైతుల అల్లాడుతుంటే మరోపక్క ఫీజుల పేర్లతో కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థలు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఫీజులు కాకుండా ఎక్స్ట్రా 30 వేల రూపాయలు ఎందుకని విద్యార్థి నేతలు ప్రశ్నించగా.. ఎక్స్ట్రా ఫీజు వసూల్ చేస్తున్న మాట వాస్తవమేమని, తమ మేనేజ్మెంట్ తో మాట్లాడి విద్యార్థి తల్లిదండ్రులు కట్టిన ఫీజును వాపాసిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థి జేఏసీ నేతలు ధర్నా విరమించారు.. ఈ ధర్నాలో జేఏసీ నేతలు సతీష్ చౌదరి, ప్రశాంత్, బుల్లే నరేష్, విజయ్, వాల్మీకి కాశీ,బీసీ రాజేష్, పోలార్డ్ నరేష్,శివుడు,గోవిందా,గోవర్ధన్, మురళి రెడ్డి, యశ్వంత్,లు పాల్గొన్నారు..

## ధర్మవరంలో ఏకలవ్య జయంతి వేడుకలు



**అంకుశం న్యూస్ ధర్మవరం జూలై 25** గిరిజనులముద్దుబిడ్డ,త్యాగానికి మారుపేరు ,"శ్రీ.ఏకలవ్య మహారాజ్ గారి జయంతిని"ధర్మవరం పట్టణంలో,"వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ"ధర్మవరం నియోజకవర్గ సమన్వయకర్త"శ్రీ.కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గారి నివాసంలో","వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ"యస్సి,యస్టి,బిసి సెల్ నాయకుల ఆధ్వర్యంలో ఏకలవ్యుని చిత్రపటానికి పులమవేసి "ఘనంగా నివాళులు అర్పించారు". ఈ సందర్భంగా వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ-యస్టి సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి- దేవరకొండ రమేష్ మాట్లాడుతూ ద్రోణాచార్యుడు అర్జునుకి విలువిద్యను నేర్పుతుంటే, కంటి చూపుతోచూసి,గురువు లేకున్నా విలువిద్యను స్వతంత్ర్యంగా నేర్చుకున్న"మహావీరుడు ఏకలవ్యుడు",బాణం సంధిస్తే గురితప్పదని, వీటిని గమనించిన ద్రోణాచార్య గురుదక్షిణగానాకు నీ కుడిచేతి బ్రిటనవేలును ఇవ్వమని అడగగానే ఏకలవ్యుడు ఆక్షణమేకోసి ఇచ్చిన"వీరుడు,ధీరుడు,ధైర్యశాలి ఏకలవ్యుడని కొనియాడారు", కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఏకలవ్యుని జయంతిని అధికారికంగా నిర్వహించాలని,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గిరిజనులకు(ఎరుకల)రాజకీయంగా,ఆర్థికంగా,ఉద్యోగరీత్యా బాగుపడ్డారంటే అది"శ్రీ.వై యస్. జగన్మోహన్ రెడ్డి గారు",ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అని,ధర్మవరం నియోజకవర్గంలో "శ్రీ.కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గారు"శాసన సభ్యునిగా ఉన్నప్పుడే అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ రమేష్, ఎం.చౌడప్ప,కునుతూరు గోపాల్, సాకే వెంకటేష్,సాకే. వీరనారప్ప, కుళ్ళయప్ప, పెద్దన్న, శ్రీనివాసులు, గజ్జల. హనుమంతు, యస్.కరుణాకర్,బత్తుల.నాగార్జున,సాకే.సాయికిరణ్,సాకే.మారుతి,కే.చైతన్య, కె.కృష్ణయ్య,నాగభూషణం,నామాల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్దారంపురం జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థిని అక్షితకీ 10000/- రూపాయలు ఆర్థికసాయం చేసిన మాజీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి...



**అంకుశం న్యూస్, బుక్కరాయసముద్రం, జూలై : 25** నేషనల్ జూనియర్స్ షూటింగ్ బాల్ టోర్నమెంట్ కీ సెలెక్ట్ అయినా సిద్దారంపురం జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థిని అక్షిత కీ ?10000/- రూపాయలు ఆర్థికసాయం చేసిన మాజీటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి. ఈ రోజు శింగనమల నియోజకవర్గం బుక్కరాయసముద్రం మండలం సిద్దారంపురం గ్రామం లోని జడ్పీహెచ్ స్కూల్ నందు చదువుకుంటున్న రాము కుమార్తె అక్షితను ఆగస్టులో జార్ఖండ్ లో జరగబోయే నేషనల్ జూనియర్స్ షూటింగ్ బాల్ టోర్నమెంట్ కు ఎన్నిక అయినా సందర్భంగా ఆర్థిక ఖర్చుల నిమ్మితం ?10000/- రూపాయలు ఆర్థికసాయం చేసిన మాజీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి, ఈ కార్యక్రమంలో, టీడీపీ నాయకులు, పసులూరు మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, చింతమాను వెంకటరాముడు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దాం





**మాదకద్రవ్యాల నివారణపై పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అంకుశం న్యూస్అనంతపురం, జులై 25:-** అనంతపురం జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మాదకద్రవ్యాల నియంత్రణ చర్యలు మరియు ఎన్సిఓఆర్డీ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్, చీజూ=ఐ) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఎస్పీ పి.జగదీష్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యాసంస్థల్లో వారానికొకసారి అవగాహన కార్యక్రమాలు డిఈఓ, ఆర్ఐఓ, ఆర్జెడిలు పాఠశాలలు మరియు కళాశాలల్లో డ్రగ్స్, గంజాయి దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాల అవగాహన కార్యక్రమాలు అన్ని విద్యాసంస్థలు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, చర్చించిన అంశాలు మరియు ఇతర వివరాలను తప్పనిసరిగా గూగుల్ ఫారంలో అప్లోడ్ చేయాలని ఆదేశించారు.

**ప్రైవేట్ పాఠశాలల ఈగల్ క్లబ్ వివరాలు**

జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన ఈగల్ క్లబ్ వివరాల ఫిజికల్ కాపీలను డీసీఆర్బీకి పంపించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.

**హాట్స్పాట్ ప్రాంతాల పరిశుభ్రత**

కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న చెరువుకట్ట దిగువనున్న పార్కును పూర్తిగా శుభ్రపరచాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. పార్కు పరిసరాల్లో ఉన్న నిరుపయోగ (గూఝిఅఎశీఅవఎ) ప్రదేశాలు మరియు హాట్స్పాట్ ప్రాంతాలను గుర్తించి వెంటనే క్లియర్ చేయాలన్నారు.'పల్లెబాటలో ఈగల్' కార్యక్రమం వ్యవసాయ శాఖ, అటవీ శాఖ, పోలీసు శాఖ మరియు ఈగల్ సెల్ సమన్వయంతో జిల్లాలోని గుర్తించిన గ్రామాలు, అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో గంజాయి సాగు నివారణ మరియు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జీఎస్టీ/కమర్షియల్ ట్యాక్స్ శాఖ అధికారులు తమ విధుల నిర్వహణలో గంజాయి లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం లభిస్తే తప్పనిసరిగా పోలీసు శాఖకు తెలియజేయాలన్నారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ పోలీసు శాఖ మరియు ఈగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించే డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సులు, సెమినార్లు, ర్యాలీలు మరియు ఇతర కార్యక్రమాలకు పూర్తి సహకారం అందించాలని పాఠశాలలు మరియు కళాశాలల యాజమాన్యాలను ఆదేశించారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడడం విద్యాసంస్థలు, పోలీసు శాఖ, ఈగల్ సెల్ మరియు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల్లో మాదకద్రవ్యాల పట్ల అవగాహన పెంచి, డ్రగ్-ఫ్రీ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ వలి భాష, ఈగల్ నోడల్ ఆఫీసర్ జయపాల్ రెడ్డి, ఈగల్ సబ్-ఇన్స్పెక్టర్ బి. హనుమంతు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బిసిలకు చట్ట సభ లలో 44% రిజర్వేషన్ల కోసం జాతీయ స్థాయిలో ఉద్యమం

## :డాక్టర్ పోతుల నాగరాజు జాతీయ అధ్యక్షులు రిజర్వేషన్ పరిరక్షణ సమితి



**అంకుశం న్యూస్ అనంతపురం జూలై 25** చట్టసభల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు కొరకు జాతీయస్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యమం చేయాలని నిర్ణయించినట్లు రిజర్వేషన్ పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు పోతుల నాగరాజు తెలిపారు పోతుల నాగరాజు మాట్లాడుతూదేశంలో 55% ఉన్న బలహీన వర్గాలకు చట్టసభ లలో 44% రిజర్వేషన్ అమలు చేసేవరకు ఉద్యమం కొనసాగుతుంది. ఈ ఉద్యమంలో దీజ లకు మద్దతుగా దళిత, గిరిజన వర్గాల ప్రజలు, ఉద్యమ సంఘాలు, ప్రజా సంఘాల నేతలు, రాజకీయ పార్టీ ల అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యుల మద్దతూ కోసం అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీ ల అధ్యక్షులకు, రాజ్య సభ, లోకసభ సభ్యులకు రిజర్వేషన్ల పరిరక్షణ సమితి లేకలు రాయడం, వారిని కలసి వినతి పత్రం ఇవ్వడం జరుగుతుంది, అన్నారు ఈ కార్యక్రమం ఈ రోజు (25) నుంచి తెలుగు రాష్ట్రములలోని పార్లమెంట్ సభ్యులకు వినతి పత్రం అందచేస్తూ, ఆగష్టు 7 న ఢిల్లీ లో కన్స్ట్యూషన్ క్లబ్ నందు జరిగే జాతీయ స్థాయి ప్రజా సంఘాల ప్రతి నిధుల సభ ద్వారా దేశం లోని అన్ని రాజకీయ పార్టీ ల మీద ఒత్తిడి తీసుకొని రావడం కోసం ఒక ఐక్యకార్య చరణ ప్రణాళికను తయారు చేయడం జరుగుతుంది. పోతుల నాగరాజు వివరించారు ఈ డిమాండ్ కు రాష్ట్రము లోని అధికార కూటమి పార్టీలు, ప్రతిపక్ష పార్టీ వైస్సార్సీపీ లు కు దీజ లకు చట్ట సభ లలో రిజర్వేషన్ కల్పించి దీజ రాజ్యాధికారం లో వాటా కోసం పార్లమెంట్ లో రాజ్యాంగం సవరణ ద్వారా రిజర్వేషన్ అమలు కోసం మీరు అసెంబ్లీ లో తీర్మానం చేసిన కాఫీ లను మీ పార్టీ పీూ ల ద్వారా కేంద్రం మీద ఒత్తిడి తీసుకొని రావాలి అని మీరు కేవలం దీజ లను మభ్యపెట్టాలని చూస్తే మీకు, మీ పార్టీ లకు భవిష్యత్తు లో పుట్టగతులు ఉండవని డాక్టర్ పోతుల నాగరాజు హెచ్చరించారు

# కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధిని ఇంటింటికీ తీసుకెళ్దాం

## అర్బన్ టిడిపి కార్యాలయంలో సమావేశం.. హాజరైన కూటమి పార్టీల నాయకులు



**అంకుశం న్యూస్, అనంతపురం,జూలై:25:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,విద్య,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలని కూటమి నాయకులు నాయకులు,కార్యకర్తలు తెలియజేశారు. ఈనెల 27వ తేదీ నుంచి చేపట్టనున్న "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి -- సంక్షేమం -- ఇంటింటి ప్రచార కార్యక్రమం"నిర్వహణపై అనంతపురం అర్బన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచనల మేరకు టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రచార కార్యక్రమానికి సంబంధించిన కార్యాచరణను రూపొందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్,జనసేన నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు,కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి,పారదర్శక పాలన,సంక్షేమ కార్యక్రమాలకు నూతన ఉత్సాహం వచ్చిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.అలాగే, అనంతపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నాయకత్వంలో చేపట్టిన రహదారుల అభివృద్ధి,తాగునీటి సదుపాయాల మెరుగుదల,విద్య, వైద్యం,మౌలిక వసతుల అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలు తదితర కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని నిర్ణయించారు.ప్రతి డివిజన్‌లో కూటమి నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో ప్రచారం నిర్వహించి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో టిడిపి, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీ టైమ్ విత్ స్టూడెంట్స్ ఎస్కేయూ స్టూడెంట్స్‌తో స్వరమే మన బలం మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి....





**అంకుశం న్యూస్, అనంతపురం, జూలై: 25** ఎస్‌కేయూ మరియు రాప్తాడు నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు, యువతతో కలిసి మాజీ ఎమ్మెల్యే, రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి "టీ టైమ్ విత్ స్టూడెంట్స్" కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువతతో ప్రకాష్ రెడ్డి గారు ఆత్మీయంగా ముఖాముఖి సమావేశమై, రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యా సమస్యలు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఉపాధి అవకాశాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉన్నత విద్య, పోటీ పరీక్షలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.విద్యార్థులు తమ అభిప్రాయాలు, సమస్యలు, ప్రభుత్వంపై ఉన్న ఆశలు, సూచనలను నేరుగా ప్రకాష్ రెడ్డి తో పంచుకోగా, ప్రతి సమస్యను ఓపికగా విన్న ఆయన, వాటి పరిష్కారం కోసం పార్టీ తరఫున నిరంతరం పోరాడుతామని భరోసా ఇచ్చారు. విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకోవడం, వారి భవిష్యత్తుకు అవసరమైన చర్యలపై సూచనలు స్వీకరించడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యంగా సాగింది. అనంతరం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. డీఎస్సీ నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలు, నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, నిరుద్యోగ భృతి అమలు, పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల విడుదల వంటి సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, నిరుద్యోగ యువత హక్కుల కోసం మన గొంతును గట్టిగా వినిపిద్దామని, ఈ ప్రజాస్వామ్య పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఎస్కేయూ విద్యార్థులకు పిలుపునిచ్చారు.

## ఒకే ఇంట్లో ముగ్గురు పిల్లలకు 'తల్లికి వందనం' డబ్బులు ఖాతాల్లో జమ



**అంకుశం న్యూస్,నల్లమాడ,జూలై :25 :** నల్లమాడ మండలం,చెరువు వాండ్ల తల్లికి వందనం పథకంలో భాగంగా ఒకే ఇంట్లో ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం డబ్బులు ఖాతాల్లో పడ్డాయి.చంద్రబాబు చెప్పినట్టుగానే ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం నెరవేర్చినందుకుగాను ఆ కుటుంబ సభ్యులు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటోకు పుష్పాభిషేకం,పాలాభిషేకం చేశారు.చెరువు వాండ్ల పల్లి గ్రామానికి చెందిన పల్లపు కృష్ణవేణి,పల్లపు కిష్టప్ప దంపతులకు ముగ్గురు పిల్లలకు గాను 39 వేలు ఎకౌంట్లో పడడంతో ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు,కోట్లో మంజూరెడ్డి,అరవింద్ బాబు,ఎమ్మెస్ లీడర్ వనజ,మల్లికార్జున రెడ్డి,రమేష్ రెడ్డి,పొరకల అభి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు దొడ్డప్ప, మహేష్ రెడ్డి,సాయి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహస్వామి దర్శనార్థం కదిరికి విచ్చేసిన కర్ణాటక బిజెపి ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్



**అంకుశం న్యూస్,కదిరి,జూలై:** 25:లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనార్థం కదిరికి విచ్చేసిన కర్ణాటక రాష్ట్రంలోని దొడ్బల్లాపూర్ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ శాసనసభ్యులు శధీరజ్ మునిరాజ్ కదిరికి విచ్చేశారు. ఈ సందర్భంగా కదిరి భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు పీట్ల రామకృష్ణ,యువ రాష్ట్ర నాయకులు హరినాథ్ నాయుడు, వినేష్,పవన్,వివేక్, ఈశ్వర్ తదితరులు వారికి ఘన స్వాగతం పలికి ఆలయ దర్శనంలో పాల్గొన్నారు.

## కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి 25 విశ్రాంతి బెంచీల విరాళం




**అంకుశం న్యూస్,కదిరి,జూలై:25:** కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులు,వారి సహాయకుల సౌకర్యార్థం రూ.80,000 విలువైన 25 విశ్రాంతి బెంచీలను సిమ్స్ హాస్పిటల్ ఎండీ,ఎన్.వై.పి.ఎస్.ఎన్.ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బి.నిసార్ యాసిన్ విరాళంగా అందజేశారు.ఈ బెంచీలను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, బి.నిసార్ యాసిన్ సతీమణి డాక్టర్ ఆసియా,వైద్య బృందం సమక్షంలో ప్రజలకు అందుబాటులో ఉంచారు.ఈ సందర్భంగా డాక్టర్ హుస్సేన్,డాక్టర్ ఆసియా,ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, సామాజిక సేవకులు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ,రోగుల సౌకర్యం కోసం చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బి. నిసార్ యాసిన్ మాట్లాడుతూ,ప్రజలకు అవసరమైన చోట సేవ చేయడం మా బాధ్యత.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు,వారి సహాయకులకు కొంతైనా ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ విశ్రాంతి బెంచీలను అందించాం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్,డాక్టర్ ఆసియా,వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, సామాజిక సేవకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం సరికాదు

**- మాజీ ఆప్కాస్ స్టేట్ బోర్డు మెంబర్ కళ్యాణ్ చక్రవర్తి**



**పోరుమామిళ్ల, జులై 25(అంకుశం పత్రిక):** నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని మాజీ ఆప్కాస్ స్టేట్ బోర్డు మెంబర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. సంవత్సరాల తరబడి కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తుతో ఎవరైనా చెలగాటమాడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పేపర్ లీక్‌కు పాల్పడిన వారిని గుర్తించి, ఈ వ్యవహారం వెనుక ఉన్న మొత్తం నెట్‌వర్క్‌పై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడంతో పాటు, నిజాయితీగా పరీక్ష రాసిన విద్యార్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రులకు నమ్మకం కలిగించే విధంగా పారదర్శకమైన విధానాలను అమలు చేయాలని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కళ్యాణ్ చక్రవర్తి అన్నారు.